# ముఖ్యమంత్రి కార్యాలయము

## తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-1 19, మే, 2015

''ఒక పని మొదలు పెట్టిన తర్వాత మధ్యలో వదిలిపెట్టే ప్రసక్తే లేదు. నేను మొండి మనిషిని, అనుకున్నది సాధించే దాకా దాని వెంబడి పడతా, దాని కథో, నా కథో తేలాలి. స్వచ్ఛ హైదరాబాద్‌లో బస్తీలు తిరుగుతుంటే ప్రజలు అనేక సమస్యలు చెబుతున్నారు. చాలా మంది పేదలకు ఇండ్లు కట్టియ్యాలి, హాస్పిటల్స్ కట్టియ్యాలి, కాలేజీలు కట్టియ్యాలి, గరీబోళ్లకు కనీస సౌకర్యాలు కల్పియ్యాలి. ఇవన్నీ పనులు చేయాలంటే జాగ కావాలే, కేసిఆర్ ఉఫ్ అని ఊదేస్తే జాగా పుట్టుకురాదు. ఎక్కడో ఉన్న చోటు నుండి సర్దాలి. సికింద్రాబాద్ నియోజకవర్గంలో ఏడున్నర వేల మందికి ఇండ్లు కట్టియ్యాలే. కనీసం ఒక పిహెచ్‌సి అయినా ఇక్కడ పెట్టాలే. కాలేజీలు కట్టుకోవాలే, మార్కెట్లు పెట్టుకోవాలే. వీటి కోసం జాగా కావాలి. ఉస్మానియా యూనివర్సిటీల కొంత జాగా తీసుకొని, పేదలకు ఇండ్లు కడతామని చెప్పిన. నేను పేదోళ్లకు ఇండ్లు కడతామంటే కొందరు నా దిష్టి బొమ్మలు కాలబెడుతున్నారు. రాజకీయ నాయకులు వాళ్లను బుజానికెత్తుకుని మోస్తున్నారు. పేదోళ్లకు ఇండ్లు కట్టొదంటున్నారు. వాళ్లు అధికారంలో ఉన్నప్పుడు పేదోళ్లను పట్టించుకోలేదు. ఇప్పుడు కూడా గట్లనే ఉండాలే అనుకుంటున్నరు. పేదోళ్ల జీవితాల్లో మార్పు రావడం వాళ్లకిష్టం లేదు. యూనివర్సిటీలకు వేల ఎకరాలు అవసరం లేదు. హార్టికల్చర్ యూనివర్సిటీకి 500 ఎకరాలు కావాలని, కేంద్రం కోరితే అంత అవసరం లేదని 50 ఎకరాలు చాలని నేను ప్రధాన మోడికే చెప్పాను. ఆయన కూడా నిజమే అన్నడు. వందలు, వేల ఎకరాల్లో యూనివర్సిటీలు అవసరం లేదు. ఇది మహారాజుల కాలం కాదు, పట్టణ ప్రాంతాల్లోని ప్రతి ఇంచూ భూమిని సమర్ధవంతంగా వినియోగించుకోవాలి. హైదరాబాద్ నగరంలో రేస్ కోర్సులకు, గోల్ఫ్ క్లబ్బులకు, పేకాట క్లబ్బులకు వందల ఎకరాల భూములు ఇచ్చింండ్రు. కాని గరీబోళ్లకు ఇండ్లు కట్టడానికి ప్రభుత్వ స్థలాలు ఉపయోగిస్తామంటే చిల్లర రాజకీయాలు చేస్తున్నారు. వాళ్లు కూడా మనలాగా పుట్టిన మనుషులే. అదృష్టం బాగా లేక పేదలుగా పుట్టింండ్రు. వాళ్లు బతుకంతా అట్లనే గడపాల్నా? వారి దుఖానికి ముగింపు

అవసరం లేదా? మన సంస్కృతి, సంస్కారం ఎక్కడ బోయింది? మన నాగరికత ఏమైంది? ఆకలితో ఉన్నోడికి రెండు ముద్దలు పెట్టాలని వేదాలు కూడా చెప్పాయి. ఆ సంస్కారం ఏమైంది? నేను ఎవరికీ భయపడను. పేదలకు న్యాయం చేసే విషయంలో వెనక్కి పోను. నగరంలోని రెండు లక్షల మంది నిరుపేదలకు దశల వారీగా ఇండ్లు కట్టించి తీరుతా. అందుకు ఖచ్చితంగా ప్రభుత్వ భూములనే ఉపయోగించుకొంటాం. ప్రజలు కూడా ధర్మం, న్యాయం వైపు నిలబడాలే. ప్రజాస్వామ్యంలో ప్రజాశక్తి గొప్పది. సంఘటిత శక్తిలో చాలా బలముంది. ఒక్క మనిషితో ఏమి కాదు. మనమందరం కలిసే మార్పు తేవాలి. హైదరాబాద్‌ను హైదరాబాదీలే మార్చుకోవాలి. మనందరం జట్టు కడితే కాని పనంటూ ఏది ఉండదు. అధర్మం ఉంటే నిలదీయాలి, ధర్మం వైపు నిలబడాలి. గతంలో సూరత్‌లో కూడా ఇలాంటి దుర్భర పరిస్థితులే ఉండేవి. ప్లేగు వ్యాధి వచ్చి ఎవ్వరు ఉండలేని పరిస్థితి వచ్చింది. అక్కడ కమిషనర్‌గా పనిచేసిన తెలుగువాడైన ఎస్‌ఆర్.రావు చొరవతో పరిస్థితిలో మార్పు వచ్చింది. మనం కూడా అలాగే మార్చుకోవాలి. స్వచ్ఛ హైదరాబాద్ కార్యక్రమం ఒక్కరోజు చేయి ఊపి పోయేది కాదు. ఫోటో ప్రోగ్రాం కాదు, పరిస్థితిలో మార్పు వచ్చే వరకు పనిచేస్తాం. వచ్చే నాలుగేళ్లు నిరంతరాయంగా ఈ కార్యక్రమం కొనసాగుతుంది.'' అని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు మంగళవారం బౌద్ధనగర్‌లో జరిగిన స్వచ్ఛ హైదరాబాద్ కార్యక్రమంలో అన్నారు.

---

సిపిఆర్ఓ టు సిఎం